




# బాధితులకు కొండంత భరోసా

## ఖమ్మం అగ్రి ఎంప్లాయీస్ అసోసియేషన్

**వనం నాగయ్య, కెరటం న్యూస్**

బతుకంటే తానొక్కడే బతకడం కాదనీ, పది మంది మేలు కోరి బతికిందే బతుకనీ, అలాగే కష్టాలు, కన్నీళ్లు ఎదురైనప్పుడు సాటి మనిషికి తోడ్పాటును అందించని జన్మ వ్యర్థమనీ, అందుకే ఆపదలో అండగా ఉండేందుకే ఇటీవల ఓ సంస్థ ముందుకు వచ్చింది. తమ సంస్థలోని కింది స్థాయి ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉండాలన్న పవిత్రమైన ఆశయంతో వచ్చి రావడంతోనే కొందరు చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం చేసి మేమున్నాము అనే భరోసాను కల్పించారు. ఆ సంస్థ మరేదో కాదు.. ఖమ్మంలోని అగ్రి ఎంప్లాయీస్ అసోసియేషన్. ఈ సంస్థకు అధ్యక్షులుగా జి.అనిల్, ప్రధాన కార్యదర్శిగా పోటు శ్రీధర్, ఉపాధ్యక్షులుగా ఎం. సంపత్, కోశాధికారిగా ఏ.హరికృష్ణ తదితర సభ్యులు ఉన్నారు. ఖమ్మం అగ్రి ఎంప్లాయీస్ అసోషియేషన్‌లోని సుమారు 350మంది సభ్యుల కుటుంబాలకు అనారోగ్యంలోనూ, ఆర్థిక ఒడిదొడుకుల్లోనూ, అకాల మరణం సంభవించినప్పుడూ వారి కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నారు.

**ఆపదలో అండగా నిలుస్తూ...**

ఖమ్మం అగ్రి ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో ఇప్పటికి పలువురు తమ సంస్థ సభ్యులకు ఆర్థిక సాయం చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారు. ఇటీవల ఈ సంస్థ చేసిన కొన్ని ఆర్థిక అండదండలను గుర్తుచేసుకుంటే.. ఫీల్డ్ అసిస్టెంట్ ఇస్లావత్ వేణు అనే వ్యక్తి విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురైనప్పుడు కాలును పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో వేణు కుటుంబం కష్టాల్లో చిక్కుకున్నప్పుడు అసోషియేషన్ ముందుకు వచ్చి వేణుకు ప్లాస్టిక్ కాలు పెట్టించేందుకు ఏకంగా రూ.2.20లక్షల ఆర్థిక సాయం అందించింది. బేయర్ కంపెనీలో పుసులూరి నాగేశ్వరరావు అనే మరో చిరుద్యోగి హార్ట్ ఎటాక్‌తో చనిపోయి ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిన సందర్భంలో అసోసియేషన్ ఆ కుటుంబానికి రూ.40వేలు ఆర్థిక సాయం అందించి భరోసానిచ్చింది. వరంగల్‌కు చెందిన మరో ఫీల్డ్ అసిస్టెంట్ చనిపోయిన తీరని దు:ఖంలో ఉన్న ఆయన కుటుంబానికి రూ.1,00,000లు అందించి అండగా నిలిచారు. మరో ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి రూ.65వేలు అందించారు. ఇలా తమ సభ్యులు ఎవరు ఆపదలో ఉన్నా మేమున్నామని సాయం అందిస్తున్నారు.

**మీ సేవలు అవసరం...రామడుగు**

పేద, మధ్యతరగతి ఉద్యోగుల కుటుంబాలు కష్టాల్లో చిక్కుకున్నప్పుడు మీరు అందించే సాయం వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలనీ, మీ సేవలు తప్పకుండా అవసరమని, ప్రతీ ఒక్కరూ ఇలాంటి సేవలను ప్రోత్సహించాలని ఖమ్మం జిల్లా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామడుగు మనోహర్ రావు అన్నారు. బుధవారం ఖమ్మం అగ్రి ఎంప్లాయిస్ అసోసియేషన్ కమిటీ మెంబర్స్ రామడుగు మనోహర్ రావుని, మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అగ్రిఎంప్లాయిస్ అసోసియేషన్





ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుజ్జ అనిల్ మరియు కార్యనిర్వాహక సభ్యులు, అక్కినేని హరికృష్ణ, కార్యదర్శి పోటు శ్రీధర్, నీరుమల్ల ఉపేందర్, ధరావత్ సుధాకర్, డివిఎస్ శర్మ, ఇట్టి కార్యక్రమానికి హాజరయ్యారు.